సాక్షి కామారెడ్డి

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



వినతులపై స్పందించాలి

ప్రజల నుంచి అందిన వినతులను వెంటనే పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 9లో ▸



స్వచ్ఛమైన నీరందించాలి

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.7 /22.4

ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

జీజీహెచ్‌ను సందర్శించిన డీఎంఈ ఓఎస్‌డీ

● మందుల కొరతపై వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సోమవారం డీఎంఈ ఓఎస్‌డీ డాక్టర్ మనీష ఆస్పత్రిని సందర్శించి, మందుల వివరాలు సేకరించారు. ఆస్పత్రిలో మందుల కొరతపై ఈనెల 9న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆరా తీసి ప్రభుత్వానికి, డీఎంఈకి నివేదించారు. ఈ నేపథ్యంలో సోమవారం డీఎంఈ ఓఎస్‌డీ డాక్టర్ మనీష ఆస్పత్రిని సందర్శించారు. ఫార్మసిస్టు, వైద్యాధికారులతో మాట్లాడి మందుల వివరాలు సేకరించారు. 80 శాతం వరకు మందుల కొరత ఉండడంతో ఆమె అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. డీఎంఈ, ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్, ఆర్‌ఎంవో యాదగిరి, ఫార్మసిస్టు నీల లింగయ్య తదితరులున్నారు.

26న జాబ్‌మేళా

కామారెడ్డి క్రైం: నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈనెల 26న కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని భారత్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లిమిటెడ్ కంపెనీలో పలు ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన వారు అర్హులని తెలిపారు. 18–28 ఏళ్ల మధ్య వయసువారు బయోడేటా, సర్టిఫికెట్లతో 26న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 76719 74009, 81210 18260 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఖోఖో జట్ల ఎంపిక



కామారెడ్డి రూరల్: గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఖోఖో అండర్–14 బాలబాలికల కామారెడ్డి జోన్ జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు మంగళవారంనుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు గర్గుల్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ హీరాలాల్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని ప్రొబెల్స్ హైస్కూల్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గర్గుల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మం, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభులింగం, దయాకర్, బాబాగౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


27న జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు

నిజామాబాద్ నాగారం: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో ముత్తెన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో 27న ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. ఇందులో జానపద నృత్యం(బృందం, వ్యక్తిగతం), జానపద పాటలు(బృందం, వ్యక్తిగతం), కథ, రచన, పోస్టర్ మేకింగ్, పెయింటింగ్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9701177144 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విత్తనోత్పత్తితో రైతులకు లాభాలు

డొంకేశ్వర్(ఆర్మూర్) : విత్తనోత్పత్తి చేయడంతో రైతులకు లాభాలున్నాయని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ ప్రవీణ్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో వరి విత్తనోత్పత్తిపై గ్రామీణ యువ రైతులకు నైపుణ్య శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలను కొనడం కన్నా నిల్వ ఉంచుకుని మరుసటి పంటకు ఉపయోగించుకోవడంతో సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ఇతర రైతులకు విక్రయించడంతో ఆదాయం కూడా అర్జించవచ్చన్నారు. డీపీడీ దైవగ్లోరి, ఏడీఏ కోటేశ్వర్‌రావు, భరత్‌కుమార్ తదితరులున్నారు.

నాడు.. నేడు..





ఆహ్లాదం.. కనుమరుగు

హైదరాబాద్ నుంచి మెదక్ మీదుగా బాన్సువాడ వెళ్లే ఎన్‌హెచ్–765 డి రహదారిపై ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో దారి పొడవునా ఇరువైపులా మర్రిచెట్లున్నాయి. అల్లుకున్నట్లుగా ఉన్న ఆ మర్రి చెట్లు.. రోడ్డు వెంట వెళ్లేవారికి నీడతోపాటు ఆహ్లాదాన్ని పంచేవి. అయితే రహదారి విస్తరణలో భాగంగా వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఆ వృక్షాలు కనుమరుగవుతున్నాయి. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

వైద్యం.. వ్యాపారం!

■ సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలానికి చెందిన ఓ పేద యువకుడు ఇటీవల తీవ్ర కడుపునొప్పితో గోదాంరోడ్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. క్రిటికల్ కండిషన్ అని చెప్పి అపెండిక్స్ ఆపరేషన్ చేశారు. ఐదురోజుల తర్వాత డిశ్చార్జి సమయంలో రూ. లక్షన్నర బిల్లు వేశారు. రూ. 1.20 లక్షల బిల్లు కట్టాకే డిశ్చార్జి చేశారు. అంత డబ్బు అవుతుందని ముందే చెబితే సర్కారు దవాఖానాకు వెళ్లేవారమని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. కాగా అపెండిక్స్ ఆపరేషన్‌కు రూ. 30 వేలలోపే అవుతుందని తెలిసింది.



■ సిరిసిల్లారోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గతంలో ఓ యువకుడి కుడి భుజానికి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్‌కు గంట ముందు అడ్వాన్స్‌గా రూ. 50 వేలు తీసుకున్నారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి మత్తుమందు డోస్ ఎక్కువగా ఇచ్చారు. దీంతో అతడు మరుసటి రోజు మరణించాడు. మిగతా డబ్బులు కట్టాకే మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆస్పత్రి యాజమాన్యం చెప్పడంతో మృతుడి గ్రామానికి చెందినవారు వచ్చి ఆందోళన చేసి, మృతదేహాన్ని తీసుకువెళ్లారు.

■ కామారెడ్డికి చెందిన ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలోగల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. కన్సల్టేషన్ ఫీజు రూ. 300 చెల్లించాడు. దీంతో ఆస్పత్రి సిబ్బంది గాయానికి కుట్లు వేసి రూ. వెయ్యి బిల్లు వేశారు. బాధితుడి వద్ద నగదు లేకపోవడంతో క్రెడిట్ కార్డు ద్వారా చెల్లిస్తానని చెప్పినా సిబ్బంది వినిపించుకోలేదు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మానవత్వం మరిచిన ఆస్పత్రి సిబ్బంది బాధితుడి తలకు వేసిన కుట్లను విప్పి పంపించారు. ఈ ఆస్పత్రి యజమానిలో ఒకరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహించే అసిస్టెంట్ ప్రొఫెసర్. కుట్లు వేసిందీ ఆయనే కావడం గమనార్హం.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యం

- మానవత్వాన్ని మర్చిపోతున్న యాజమాన్యాలు
- రోగులను పీల్చిపిప్పిచేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యాన్ని వ్యాపారంగా మార్చాయి. ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ రోగులను పీల్చి పిప్పి చేస్తున్నాయి. మానవత్వాన్ని మర్చిపోయి మృతదేహాన్ని అడ్డం పెట్టుకుని కూడా దందా చేస్తున్నాయి. ఆస్పత్రులలో ఇటీవల చోటు చేసుకున్న పలు ఉదంతాలు విస్మయానికి గురిచేస్తున్నాయి.

ధనార్జనే ధ్యేయంగా..

జిల్లా కేంద్రంలో పలువురు వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకున్నారు. ఆస్పత్రి ఏర్పాటు చేసి ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వైద్యులను తీసుకుని వస్తున్నారు. మెడికల్ దుకాణాలు, ల్యాబ్‌లను అర్హత లేని వ్యక్తులతో వారే కొనసాగిస్తున్నారు. వైద్య వ్యాపారం కోసం ప్రత్యేకంగా పీఆర్వోలనూ ఏర్పాటు చేసుకుంటున్నారు. రోగులను తీసుకు వచ్చే పీఎంపీలకు 20 నుంచి 25 శాతం కమీషన్ ఇస్తూ దందా చేస్తున్నారు. జ్వరంతో వచ్చినవారిని అవసరం లేకున్నా భయపెట్టి ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుంటున్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్‌లు, ఎక్స్‌రేలు తీయిస్తూ రోగుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారు. చిన్నచిన్న ఆపరేషన్లకే వేలు, లక్షలు బిల్లులు వసూలు చేస్తున్నారు. ఇటీవల విషజ్వరాలతో వచ్చిన రోగులకు ప్లేట్‌లెట్స్ తగ్గాయని చెప్పి భయపెట్టి, ఆస్పత్రులలో చేర్చుకుని రోజుకు రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకు బిల్లులు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. కొన్ని ఆస్పత్రుల్లో తప్పుడు రక్త పరీక్షలతో రోగులను అడ్మిట్ చేసుకుని వైద్యం చేశారని తెలిసింది.

కన్నెత్తి చూడని వైద్యారోగ్య శాఖ..

వైద్య ఆరోగ్య శాఖలో ఓ ఉన్నతాధికారితో పాటు ఇద్దరు ఉద్యోగులు ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి నిబంధనలు పాటించకున్నా రూ. లక్షలు తీసుకుని ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌లు, రెన్యువల్‌లు చేస్తున్నారని తెలుస్తోంది. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా వైద్యాధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి.

ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం



జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేస్తున్నాం. వైద్య సేవల విషయంలో ఫిర్యాదులు వస్తే విచారణ జరుపుతాం. ఆస్పత్రుల నిర్వాహకులు తప్పు చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

పలు ఘటనలు..

❖ జాతీయ రహదారి సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో గతంలో ఓ వ్యక్తి మరణించాడు. ఆస్పత్రి నిర్వాహకులు అతడు చనిపోయిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పకుండా రెండు రోజులపాటు ఐసీయూలో ఉంచి రూ. 1.50 లక్షల బిల్లు వేశారు. ఈ విషయం తెలియడంతో మృతుడి బంధువులు రోజంతా ఆందోళన చేశారు.

❖ జిల్లాకేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలియడంతో అధికారులు ఆస్పత్రిని సీజ్ చేశారు. కొన్నాళ్లకే సదరు ఆస్పత్రి యాజమాన్యం పేరు మార్చి మళ్లీ అదే కాలనీలో మరో ఆస్పత్రిని తెరిచింది. ఇటీవల లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ మళ్లీ దొరికిపోయింది. అయినా ఆ ఆస్పత్రి యథేచ్ఛగా కొనసాగుతుండడం గమనార్హం.

❖ పాత బస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అర్హత లేని వ్యక్తులతో స్కానింగ్ చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటివి జిల్లావ్యాప్తంగా నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

ఆ బడి టీచర్లు ఆదర్శం!



దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

- ప్రతి నెలా తలా రూ.500 జమ
- తాత్కాలిక వాచ్‌మన్, అటెండర్ల వేతనాలకు చెల్లింపు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉంది. అక్కడక్కడ కొందరు తప్పుడు పనులకు పాల్పడి వృత్తికి కళంకం తెస్తున్నా, మెజారిటీ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలలు మిగిలి ఉన్నాయి. లేకుంటే ఎప్పుడో మొత్తానికి మొత్తం మూతబడేవి. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయడమే కాదు పాఠశాలలో కావలసిన సౌకర్యాలు కల్పించుకునేందుకు తమకు తాముగా వేతనం నుంచి ప్రతి నెలా కొంత ఖర్చు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇందుకోసం ప్రతి ఉపాధ్యాయుడు ప్రతి నెలా తన వేతనం నుంచి రూ.500 జమ చేస్తున్నారు. మొదట్లో రూ.300 ఇచ్చేవారు. పాఠశాలలో 370 మంది విద్యార్థులు, 18 మంది టీచర్లు ఉన్నారు. అయితే పాఠశాలకు అటెండర్ లేకపోవడం, నైట్ వాచ్‌మన్ లేకపోవడం సమస్యగా ఉండింది. అప్పటి స్థానిక కౌన్సిలర్ కాసర్ల గోదావరి, స్వామి దంపతులు తమ వంతు సాయం అందిస్తామని చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు అప్పట్లో ప్రతి నెలా రూ. 300 చొప్పున జమ చేయగా వచ్చిన డబ్బులకు కౌన్సిలర్ దంపతులు మిగతా సొమ్ము కలిపి వాచ్‌మన్ కం అటెండర్‌గా పనిచేసిన భార్య, భర్తలకు జీతం సర్దుబాటు చేసేవారు.

అలాగే టాయ్‌లెట్ల క్లీనింగుకు అవసరమైన యాసిడ్స్, చీపుర్లు కూడా కొనేవారు. తరువాతి కాలంలో వాచ్‌మన్, అటెండర్లకు జీతం సరిపోవడం లేదనడంతో టీచర్లు నెలానెలా ఇచ్చే రూ.3 వందలను రూ.5 వందలకు పెంచుకున్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులు సమకూర్చే డబ్బు రూ.9 వేలతో పాటు తాజా మాజీ కౌన్సిలర్ దంపతులు ఇస్తున్న డబ్బులతో కలిపి ప్రతి నెలా వేతనంగా రూ.10 వేలు, అలాగే చీపుర్లు, టాయ్‌లెట్ల క్లీనింగుకు అవసరమైన ఫినాయిల్, యాసిడ్లు కొనుగోలుకు రూ.3 వేలు ఖర్చవుతున్నాయి. వేసవి సెలవుల్లో కూడా వాచ్‌మన్ డ్యూటీలో ఉండాల్సిందే. సెలవుల్లో కూడా టీచర్లు వేతనం నుంచి ఇవ్వాల్సిందే. దాదాపు నాలుగేళ్లుగా వాళ్లు తమ వేతనం నుంచి డబ్బులు సమకూరుస్తూ పాఠశాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకుంటున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ గంగాకిషన్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. పాఠశాలలో పనిచేసే అందరు టీచర్ల సమష్టి నిర్ణయం, అందరి సహకారంతో కొనసాగిస్తున్నామని, మునుముందు ఇలాగే కొనసాగుతుందన్నారు.

జీజీహెచ్‌లో ఇంటర్నెట్ సేవలు బంద్!

- రీచార్జి చేయించకపోవడమే కారణం
- వారం రోజులుగా ఆన్‌లైన్ సేవలకు ఆటంకం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో వారం రోజులుగా ఇంటర్నెట్ సేవలు బంద్ అయ్యాయి. బ్రాడ్ బ్యాండ్ రీచార్జి చేయకపోవడమే ఇందుకు కారణం కావడం గమనార్హం. బిల్లు తీసుకొస్తే రీచార్జికి సంబంధించిన చెక్కు ఇస్తామని వైద్యాధికారులు చెబుతున్నారు. కానీ ఫోన్ ద్వారా రీచార్జి చేస్తుండడంతో బిల్లు ఎలా తెచ్చేదని సిబ్బంది పేర్కొంటున్నారు. దీంతో సమస్య పరిష్కారం కావడం లేదు. బ్రాడ్ బ్యాండ్ రీచార్జి ముగియడంతో వారం రోజులుగా ఆస్పత్రిలో ఆన్‌లైన్ సేవలకు ఆటంకం కలుగుతోంది. అత్యవసర సమయాలలో సిబ్బంది ఫోన్ ద్వారా కనెక్ట్ చేసుకుని ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంసింగ్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కాంగ్రెస్ ఘనతే




జిల్లా కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత

- ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత
- జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ఎల్లారెడ్డి: వైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత పేర్కొన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. పేద ఆర్యవైశ్యులకు అన్ని రంగాలలో సహాయ సహకారాలు అందిస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ పేర్కొన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డిలలో వైశ్య సంఘం భవనాల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కంచర్ల బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా ముత్యపు సుదర్శన్, కోశాధికారిగా మోటూరి రాజుతో పాటు జిల్లా యువజన, మహిళ, వాణిజ్య విభాగాలకు సంబంధించిన ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు కంచర్ల లింగం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గౌరీశంకర్, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు పాత బాలకృష్ణ, నార్ల రత్నకుమార్, వంగపల్లి నాగభూషణం, యాద నాగేశ్వర్‌రావు, యంసాని సుధాకర్, మర్మల్ల వెంకటేశం, సతీశ్, విఠల్, సంతోష్ పాల్గొన్నారు.

కళకళలాడుతున్న పంటలు

- జిల్లాలో 5.42 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- దిగుబడులపై రైతుల్లో ఆశలు



నిండుకుండలా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టు

నిజాంసాగర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు కళకళలాడుతున్నాయి. దీంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ఈనెలలో భారీ వర్షాలు కురియడంతో జిల్లాలోని ప్రధాన జలాశయాలతో పాటు చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్ ప్రాజెక్టు, కళ్యాణి ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. పోచారం ప్రాజెక్టుతో పాటు సింగితం రిజర్వాయర్ అలుగులు పారాయి. జిల్లాలో 1,515 చెరువులు, కుంటలు ఉండగా.. 1,110 చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగెల్లాయి. 90 చెరువులు, కుంటలు వందశాతం నీటిమట్టానికి చేరువలో ఉన్నాయి. మిగతావి 75 శాతానికిపైగా నిండాయి.

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 5.42 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో ఎక్కువగా వరి సాగు చేశారు. చాలాచోట్ల బోరుబావులతో పాటు వర్షాధారంగా, ప్రాజెక్టులు, చెరువుల కింద పంటలు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో వర్షాధారంగా సాగు చేసిన పంటలకు జీవకళ వచ్చింది. పంటలు కళకళలాడుతుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వానా కాలంతో పాటు యాసంగి పంటలకూ ఢోకా ఉండదని పేర్కొంటున్నారు.



బిచ్కుంద మండలంలో సాగవుతున్న సోయా పంట

క్లుప్తంగా

22వ ప్యాకేజీ నిర్మాణం పనులు చేపట్టాలి



ఎల్లారెడ్డి : వీలైనంత త్వరలో 22వ ప్యాకేజీ నిర్మాణం పనులు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న 22వ ప్యాకేజీ పనులకు సంబంధించిన రివ్యూ సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. ప్యాకేజీ పనుల్లో భాగంగా భూంపల్లి, కాటేవాడి, మోతె ప్రాంతాల్లో రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గం సాగునీటితో సస్యశ్యామలమవుతుందని ఎమ్మెల్యే మంత్రికి వివరించారు.

మంత్రి సీతక్కను కలిసిన మాచారెడ్డి నేతలు



మాచారెడ్డి : పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కను మాచారెడ్డి మండల కాంగ్రెస్‌నేతలు సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. మాచారెడ్డిలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలిసి మంత్రి సీతక్కకు వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సోమారం పేట, బంజపల్లి మోటర్ బండ లొద్ది, సిక్కులోని లొద్ది, సద్దాపూర్ సోమారం పేట తండా మర్రి తండా నెమిలిగుట్ట తండాల్లో దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, కుంటలు మరమ్మత్తు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నౌసిలాల్, నేతలు గణేశ్‌నాయక్, బన్సీనాయక్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డి అభివృద్ధికి నిధులివ్వండి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విన్నవించారు. సోమవారం మంత్రి సీతక్కను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి రూ. 244 కోట్లు పంచాయతీరాజ్ నుంచి కేటాయించాలని ఆయన కోరారు.

జిల్లా కేంద్రంలో బ్రహ్మానందం సందడి



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నూతన బాంబేక్లాత్ హౌజ్ షోరూంను సోమవారం హాస్యనటుడు బ్రహ్మానందం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, పూజలో పాల్గొన్నారు. కాసేపు సందడి చేశారు. ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. అరగంట పాటు ఉండి తిరిగి ఆయన తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. కార్యక్రమంలో యాజమాన్యం రాజ్‌కుమార్, లాల్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

బాన్సువాడ : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. సోమవారం బాన్సువాడ మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో మంచినీటిని కలుషితం కాకుండా చూడాలని, లీకేజీలు ఉన్న పైపులైన్లకు మరమ్మతులు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేయాలని సూచించారు. ప్రతివారం వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలపాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు ఉన్నారు.



బాన్సువాడలో తాగునీటిపై సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

ఎయిడ్స్‌పై అవగాహనకు క్విజ్ పోటీలు

నిజామాబాద్‌నాగారం: 'యూత్ ఫెస్ట్'లో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలోని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నగరంలోని నెహ్రూ యువకేంద్రంలో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని 13 ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న 9, 10వ తరగతి విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఏఐడీఎస్, టీబీలపై అవగాహన కల్పించేందుకు క్విజ్ నిర్వహించారు. కోటగల్లికి చెందిన చంద్రజ, శర్వాణ్ మొదటి బహుమతి (రూ.వెయ్యి), కుమార్ గల్లీకి చెందిన స్వామి, కావేరి ద్వితీయ బహుమతి(రూ.750), కుమార్‌గల్లీకి చెందిన స్వాతి, కావేరి(రూ.750) తృతీయ స్థానంలో విజయ్‌సాయికి చెందిన బూశ్ర, జవేరియా (రూ.500) నిలిచారు.



రేషనలైజేషన్ జీవో నిబంధనలను మార్చాలి

బాన్సువాడ : రేషనలైజేషన్ జీవో 25 నిబంధనలను మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శంభ్యానాయక్ అన్నారు. అశాస్త్రీయమైన సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటుతో బదిలైన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించవలసి ఉండగా అశాస్త్రీయమైన జీవో 25 అమలు చేయాలని పాఠశాల విద్యా సంచాలకులు జిల్లా కలెక్టర్లకు ఆదేశించడాన్ని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం..

కామారెడ్డి టౌన్ : విద్యాశాఖ జారీ చేసిన రేషనలైజేషన్ జీవో 25 నిబంధనలను మార్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన సర్దుబాటుప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ స్పందించాలని, న్యాయం చేయలేని పక్షంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు.

వీడీసీ స్థలం కబ్జాపై నేడు సమావేశం



భిక్కనూరు : కబ్జాకు గురైన రూ. 3 కోట్ల విలువచేసే వీడీసీ స్థలం విషయమై గ్రామస్తులతో ఈనెల 24న మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అఖిల పక్షం నేతలు మాజీ సర్పంచ్ తున్కి వేణు, తాటిపాముల లింబాద్రి, మైపాల్‌రెడ్డి, అందే మహేందర్‌రెడ్డి, కేవీ సుబ్బారావు, ఉప్పరి సాయిలు, సిద్దగౌడ్, సరస్వతి ప్రభాకర్, సింగిల్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్యలు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల వరకు జీపీ ఎదురుగా ఉన్న చమాన్ దగ్గరికి ప్రతి కులం నుంచి 10మంది, అన్ని పార్టీల నేతలు హాజరుకావాలన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : గ్రామాల్లోని మంచినీటి సహాయకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించా రు. నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద రైతువేదికలో సోమవారం మండలంలోని అన్ని జీపీల్లో ఉన్న మంచినీటి సహాయకులకు(వాటర్‌మన్) ఏర్పాటు చేసిన నాలుగురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు వాటర్‌మెన్లకు తగిన శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈఈ ప్రవీణ్, ఏఈ వినోద్, ఎంపీడీవో ప్రభాకరచారి, మిషన్ భగీరథ సూపర్‌వైజర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

25న జోనల్ స్థాయి ఖోఖో జట్ల ఎంపిక

బాన్సువాడ : ఈనెల 25న బాన్సువాడ జోనల్ స్థాయి అండర్-14, అండర్-17 ఖోఖో బాలికలు, బాలుర జట్లను ఎంపిక చేయనున్నట్లు జోనల్ క్రీడా పోటీల ఇన్‌చార్జి ప్రేమ్ తెలిపారు. బాన్సువాడలోని మినీ స్టేడియంలో బుధవారం ఉదయం 10 గంటలకు బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు.

28న లోక్ అదాలత్

బిచ్కుంద(జుక్కల్) : ఇరువర్గాల కక్షిదారులు రాజీపడి లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవచ్చని సీఐ నరేశ్ తెలిపారు. ఈనెల 28 బిచ్కుంద కోర్టులో లోక్ అదాలత్ ఉందన్నారు. కేసులు ఎదుర్కొంటున్న ఇరువార్గాల వారు రాజీపడి కక్షలకు వెళ్లకుండా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని సీఐ కోరారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్ : జిల్లాలోని మాచారెడ్డి, నాగిరెడ్డిపేట మండల కేంద్రాలలో రేకుల షెడ్‌లో కొనసాగుతున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మణికంఠ తదితరులున్నారు.

పార్ట్‌టైం టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో పార్ట్‌టైం టీచర్ పోస్టులకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్‌స్కూల్‌లో పీజీటీ విభాగంలో మ్యాథ్స్, కెమిస్ట్రీ, బాటనీ, కామర్స్, టీజీటీలో ఇంగ్లిష్, సైన్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి ఖాళీలున్నాయన్నారు. పీజీటీకి సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, బీఈడీ, టీజీటీలో డిగ్రీ, బీఈడీ ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అవకాశం ఉందన్నారు.

రాజంపేటలో బస్సులు ఆపాలి

కామారెడ్డి టౌన్/రాజంపేట : మండల కేంద్రంలోని కొత్త బీసీ కాలనీ ఎల్లమ్మ ఆలయం వద్ద కామారెడ్డి నుంచి గుండారం వైపు వెళ్లే బస్సులు ఆపాలని కోరుతూ కాలనీవాసులు, గ్రామస్తులు సోమవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా బీసీ కాలనీ వద్ద బస్సులు ఆపడం లేదని దీంతో రెండు కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుందని తెలిపారు. బీసీ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు తరలి వెళ్లి సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సీసీ రోడ్లు, మురికి కాలువలు, వీధి దీపాలు, నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సంక్షిప్తం

అగ్నివీర్ జవాన్‌కు ఘన సన్మానం



మద్నూర్(జుక్కల్) : మండలంలోని కోడిచిరకు చెందిన పారా ఎస్ఎఫ్ కమాండో బోయిన్‌వార్ రమేశ్ శిక్షణ ముగించుకుని రావడంతో మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంగమేశ్వర్, గ్రామస్తులు ఘన సన్మానం ఏర్పాటు చేశారు. గతేడాది బోయిన్‌వార్ రమేశ్ అగ్నిపథ్‌కు ఎంపికయ్యాడు. ఆయన తల్లిదండ్రులు సాయిలు, గంగామణి, గ్రామస్తులు, స్నేహితులు కలిసి అగ్నివీర్ జవాన్‌కు శాలువాతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడికి..



భిక్కనూరు : ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన జీపీ సిద్ధరాములను సోమవారం పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా జీపీ సిద్ధరాములు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రమేశ్, రాజు, అమర్ తదితరులున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్, కళాశాల జువాలజీ డిపార్ట్‌మెంట్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్ కౌన్సిలర్ డాక్టర్ శ్రీలత విద్యార్థులకు హెచ్‌ఐవీ సోకడానికి కారణాలు, నివారణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి, అధ్యాపకులు కృష్ణ, పద్మ, విఠల్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తొలగించాలి



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని 35వ వార్డులో సిద్ధి వినాయక నగర్ కాలనీలోని ప్రధాన రోడ్డులో ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని సోమవారం 35వ వార్డు బీజేపీ ఇన్‌చార్జి భోజన్నగారి రాజు పాటిల్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో డీఈకి కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో భూపతి, భాస్కర్‌రెడ్డి, రాజు, కృష్ణ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహోత్సవం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 9, 11 వ వార్డ్ లింగాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. తల్లులు బాలింతలు గర్భిణులకు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని స్థానికంగా లభించే వస్తువులతో పాటు బాలామృతం ఉపయోగించి ఏఏ వస్తువులను తయారు చేసుకోవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ విద్యార్థినులు, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మి తదితరులున్నారు.

చీనూర్ కిసాన్ సంఘ్ కమిటీ ఎన్నిక



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని చీనూర్ గ్రామానికి సంబంధించి భారతీయ కిసాన్‌సంఘ్ కమిటీని సోమవారం విద్యుత్ వినియోగదారుల ఫోరం సభ్యులు రాజాగౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామకమిటీ అధ్యక్షుడిగా బోయిని భిక్షపతి, ఉపాధ్యక్షులుగా బోయిని బలరాం, మెరిగే వెంకట్‌రాములు, కార్యదర్శిగా మామిండ్ల ప్రశాంత్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా గంపల హన్మంతు, సలహాదారులుగా బోయిని లింగం, మెరిగే నారాయణ ఎన్నుకున్నారు.

మూగ వ్యక్తి ఇంటి నిర్మాణానికి సాయం



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్‌లో నిరుపేద మూగ వ్యక్తి ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇటుకను ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ సోమవారం పంపించారు. తిప్పాపూర్‌లో మహ్మద్ మునాఫ్ అనే వ్యక్తి పుట్టు మూగవాడు. అయన కుమారుడు కూడా మూగవాడే. వారి ఇంటిని నిర్మించుకునేందుకు ఇటుకలు అవసరం ఉండగా విషయం తెలుసుకుని మాజీ విప్ గంప గోవర్ధన్ ఆ ఇంటికి రూ. 70వేల విలువ చేసే ఇటుకలు పంపా రు. ఈ సందర్భంగా మునాఫ్ కుటుంబీకులు, గ్రా మస్తులు గోవర్ధన్‌ను అభినందించారు.

చేతిపంపుల మరమ్మతులపై అవగాహన



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలో మంచి నీటి సహాయకులకు చేతి పంపుల మరమ్మతుల గురించి సోమవారం అవగాహన ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రమేశ్ మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి ఒక్కరిని ఎంపిక చేసి వారికి చేతి పంపుల మరమ్మత్తు గురించి, వాటర్ ట్యాంకుల పరిశుభ్రత, క్లోరనైజేషన్ తదితర విషయాలపై 3 రోజుల పాటు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జీఎస్ఎన్‌వీ రమేశ్, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయండి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజుకు వినతిపత్రం అందించారు.హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన చెన్నయ్యగారి భాస్కర్ అలియాస్ స్వామి(28) తాగుడికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తాగుడికి బానిసైన స్వామి డబ్బుల కోసం ఈనెల 21వ తేదీన తల్లిని కొట్టడంతో ఆమె ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న స్వామి సోమవారం దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేధింపులు భరించలేక..



కామారెడ్డి క్రైం: అదనపు కట్నం తీసుకురావాలని తన భార్యను ఓ వ్యక్తి స్నేహితుడితో కలిసి వేధించాడు. భర్తతోపాటు అతడి స్నేహితుడి వేధింపులను తాళలేక ఆమె పురుగుల మందు సేవించింది. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో ప్రాణాలు విడిచింది. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేటకు చెందిన రంగ గంగాధర్‌గౌడ్‌కు 9ఏళ్ల క్రితం రాణి(32)తో వివాహం కాగా, ఇద్దరు కుమారులు న్నారు. కొంత కాలంగా గంగాధర్‌గౌడ్ తోపాటు అతని స్నేహితుడు సతీశ్ రాణిని అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించడం మొదలు పెట్టారు. చాలా సార్లు తన కూతురిని తీవ్రంగా కొట్టారని రాణి తండ్రి రాజేశ్వర్‌గౌడ్ ఈ నెల 6న పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజున పాలల్లో పురుగుల మందు కలుపుకుని సేవించడంతో రాణిని నిజామాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించామన్నారు. పరిస్థితి విషమించడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా ఆదివారం అర్ధరాత్రి మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, రాణి మృతికి కారకులైన ఆమె భర్త గంగాధర్‌గౌడ్, ఆయన స్నేహితుడు సతీశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

అనారోగ్య కారణాలతో..



బాల్‌రాజు(ఫైల్)

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని సరంపల్లి గ్రామానికి చెందిన పోలు బాల్‌రాజు(43) అనారోగ్యంతో బాధపడుతున్న ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుటుంబంతో కలిసి 8 నెలలుగా కామారెడ్డిలో నివాసం ఉంటున్న బాల్‌రాజు కడుపు, గుండె నొప్పితో బాధపడేవాడు. ఆదివారం స్వగ్రామానికి వెళ్లిన ఆయన ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం విషయం తె లియడంతో కుటుంబసభ్యులు గ్రామానికి వెళ్లారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్‌ఐ రాజు తెలిపారు.

ఒకరి అదృశ్యం



బహదూర్‌ఖాన్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మహ్మద్ బహదూర్ ఖాన్ (50) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. డ్రైవర్‌గా పని చేసే బహదూర్ ఖాన్ ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఖాన్ ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య నూర్జహాన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆరేళ్ల చిన్నారితో టీచర్ అసభ్య ప్రవర్తన!

కామారెడ్డి క్రైం: విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్ ఆరేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కామారెడ్డిలో సోమవారం వెలుగు చూసింది. చిన్నారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పట్టణంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్న పీఈటీ తోటి పిల్లలను ఆడుకోడానికి పంపించాడు. అదే తరగతికి చెందిన ఓ చిన్నారిని ఆడిస్తున్నట్లు నటించి చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు చిన్నారి ఇంట్లో నిద్రించిన సమయంలో భయంతో ఉలిక్కిపడుతుండడంతో తల్లిదండ్రులు ఏమైందని అడుగగా ఆమె అసలు విషయం చెప్పింది. వెంటనే చిన్నారి తల్లిదండ్రులు బాలల సంరక్షణ అధికారులకు సమాచారం ఇచ్చారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం.

ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష

- రూ. 2.10 లక్షల జరిమానా

కామారెడ్డి క్రైం: ఇంటి ముందర ఉన్న గుడిసె విషయంలో జరిగిన వివాదంలో ఓ వ్యక్తి మృతికి కారకుడైన సంటోళ్ల బాలరాజు అనే వ్యక్తికి కామారెడ్డి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించింది. సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన బెల్లి రామయ్య(65) తన కుమార్తెను మాచారెడ్డి మండలం ఫరీద్‌పేటకు చెందిన సంటోళ్ల బాలయ్యకు ఇచ్చి గతంలో వివాహం జరిపించాడు. 2020 ఏప్రిల్‌లో బాలయ్య ఇంటి ముందున్న గుడిసె స్థలానికి సంబంధించి బంధువుల మధ్య గొడవ జరిగింది. అప్పుడు జరిగిన పంచాయితీలో రామయ్య పాల్గొనగా, అక్కడ చోటుచేసుకున్న ఘర్షణలో బంధువైన సంటోళ్ల బాలరాజు ఆవేశంతో ఆయనపై దాడి చేశాడు. బలమైన గాయం కావడంతో రామయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడి కుమార్తె సురేఖ ఫిర్యాదు మేరకు మాచారెడ్డి పీఎస్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి రూరల్ సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రస్తుత సీఐ రామన్, ఎస్సై అనిల్, పీపీ రాజగోపాల్‌గౌడ్, సిబ్బంది హరిప్రసాద్, ప్రకాశ్, మురళీని ఎస్పీ సింధూశర్మ అభినందించారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి ఉద్యోగి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన ఘటన కామారెడ్డి పెద్ద చెరువు వద్ద సోమవారం జరిగింది. పట్టణంలోని కల్కినగర్ కాలనీలో నివాసం ఉండే నాయకోటి శ్రీనివాస్ (45) భిక్కనూర్ మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం స్నానం చేసి వస్తానని చెప్పి పక్కనే ఉండే పెద్ద చెరువుకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా, బైక్, చెప్పులు, దుస్తులు కనిపించడంతో ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా, శ్రీనివాస్ మృతదేహం లభించింది. మృతుడికి భార్య చంద్రకళ, కుమార్తె సౌమ్యం ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

15 రోజులుగా సెలవులో..

భిక్కనూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న నాయికోటి శ్రీనివాస్ 15 రోజులుగా సెలవులో ఉన్నాడు. కార్యాలయ సిబ్బంది ఉదయం ఆయనకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. శ్రీనివాస్ మృతి తెలిసి ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

క్షుద్రపూజల పేరుతో మోసగించేందుకు యత్నం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

- నిందితుల అరెస్ట్, రిమాండ్
- గతంలో పలువురు మహిళలను నిందితులు మోసం చేసినట్లు నిర్ధారణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్షుద్రపూజలు చేస్తే డబ్బులు వస్తాయని మహిళలను నమ్మించి మోసం చేసిన కేసులో ఆరుగురిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన పైడాకుల తిరుపతితోపాటు అతడి భార్య స్వప్న గ్రామానికి చెందిన ఓ మహిళకు క్షుద్ర పూజలు చేస్తే కోటి రూపాయలు వస్తాయని మాయమాటలు చెప్పారు. దీంతో ఆమె ఈనెల 17న తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో వారిపై ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టారు. తిరుపతితోపాటు అతడి భార్య, బూర్గుల్‌కు చెందిన శ్రీరాం సాయిలు, హైదరాబాద్‌కు చెందిన జమాల్‌పూర్ సాయికుమార్, బోధన్‌కు చెందిన గూడ్ అలియాస్ సలీం, బోధన్‌లోని జైతాపూర్‌కు చెందిన సత్యనారాయణ అలియాస్ సతీశ్, బోర్గాంకు చెందిన బానోత్ మోతీలాల్ పూజలు చేస్తామని చెప్పి చాలా మంది మహిళల నుంచి డబ్బులను వసూలు చేయడమే కాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తేల్చారు. ఈ కేసులో షేక్ గూడ్, సత్యనారాయణ, బానోత్ మోతీలాల్, జమాల్‌పూర్ సాయికుమార్, సాయిలు, పైడాకుల తిరుపతిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూఢనమ్మకాలకు బలికావొద్దని, పూజలపేరుతో ఎవరైనా నమ్మించే ప్రయత్నం చేస్తే పోలీస్ స్టేషన్‌లో లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు. సీఐ సంతోష్‌కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన మానిటర్ ప్రత్యక్షం

- కేసు విచారణలో వేగం పెంచిన పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల పరిషత్ కార్యాలయం నుంచి ఈనెల 13న కంప్యూటర్‌లు, మానిటర్, బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. ఈ విషయమై ఎంపీడీవో సంతోష్‌కుమార్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మండల పరిషత్‌లో పని చేస్తున్న సిబ్బంది వివరాలను, ఫోన్ నంబర్లను నమోదు చేసుకున్నారు. కార్యాలయానికి వేసిన వేసినట్లే ఉండగా దొంగలు పడ్డ విషయంపై పోలీసులు ఆరా తీస్తున్న క్రమంలో మానిటర్ ప్రత్యక్షమవడం సిబ్బంది గుండెల్లో గుబులు మొదలైంది. పోలీసులు విచారణ కొనసాగిస్తుండగానే సోమవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగం మెట్ల వద్ద మానిటర్ ప్రత్యక్షమవడం ఆందోళనకు గురి చేస్తోంది. కార్యాలయంలో పని చేసే సిబ్బందే ఈ చోరీకి పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మానిటర్‌పై ఉన్న వేలి ముద్రలను సేకరించి నిందితుడు ఎవరో పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.